దసరా వైభవం

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో శనివారం దసరా సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే శమీ వృక్షం వద్ద పూజలు నిర్వహించారు. ఒకరికొకరు జమ్మి ఆకును ఇచ్చి పుచ్చుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. దసరా సందర్భంగా కల్యాణోత్సవాలు, తెప్పోత్సవాలు, రథోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

- కిటకిటలాడిన ఆలయాలు
- శమీ వృక్షాన్ని దర్శించుకున్న భక్తులు



తాడిపత్రిలో శమీవృక్ష దర్శనానికి హంసవాహనంపై వచ్చిన చింతల వెంకటరమణస్వామి, బుగ్గ రామలింగేశ్వరుడు



తాడిపత్రిలో రజత కవచ అలంకారంలో గాయత్రీదేవి



తాడిపత్రిలో వజ్ర కవచ అలంకారంలో వాసవీమాత



యల్లనూరులో అలంకరణలో కొలువుదీరిన దుర్గమ్మ



పుట్లూరులో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం



బుక్కరాయసముద్రంలో బోనాలను మోస్తున్న భక్తులు

తాడిపత్రి అర్బన్: దసరా పండుగ సందర్భంగా శనివారం శక్తిస్వరూపిణీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు కొత్త బట్టలు ధరించి పిండి వంటలు తయారుచేసి అమ్మవారికి సమర్పించారు. పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం 5గంటలకు వైశ్య పతాకావిష్కరణ చేసిన అనంతరం 5.30నిమిషాలకు ఆర్యవైశ్య సంఘం వారిచే సుప్రభాత సేవ నిర్వహించారు. రాత్రి 9గంటలకు వాసవీ కన్యకాపరమేశ్వరి రథోత్సవం చేపట్టారు. చింతల వెంకటరమణస్వామి ఆలయం, బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు వేద గాయత్రీ మాత ఆలయం, తదితర శక్తి స్వరూపిణీ అలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, దుర్గాభవానీ, కాళికామాత, సుంకులమ్మ, మస్తాన్‌పేట మారెమ్మ, త్రిపుర సుందరీ దేవి, వేంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం మస్తాన్‌పేట్ మారెమ్మ అమ్మవారి శోభాయాత్ర కనుల పండువగా సాగింది.

గుత్తి: ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన దసరా ఉత్సవాలు ఆదివారం వసంతోత్సవం, తెప్పోత్సవంతో ముగిశాయి. గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువ జన సంఘం, వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో వసంతోత్సవం, తెప్పోత్సవాలు, పల్లకీ సేవ, గ్రామోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అలాగే కోట వీధిలో రేణుకా ఎల్లమ్మ దేవాలయం కమిటీ సభ్యులు, రేణుకా ఎల్లమ్మ భక్త బృందం సభ్యులు ఆధ్వర్యంలో బెణకల బావిలో రేణుకా ఎల్లమ్మ తెప్పోత్సవం చేపట్టారు.

పుట్లూరు: పుట్లూరులో ఎంపీపీ రాఘవరెడ్డి, ఎంపీటీసీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామిని దర్శించుకున్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సచివాలయం దగ్గర ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం గ్రామస్తులు పెద్దమ్మ తల్లికి బోనలు సమర్పించారు. ఉరుముల శబ్ధాలతో ఆలయ ప్రాంగణం అంతా మార్మోగింది. డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, ముసలమ్మ దేవత వంశస్తులు సూర్య నారాయణరెడ్డి, సుశీలమ్మ, గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పామిడి: పామిడిలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో మంగళవాయిద్యాలు, చెక్కభజనలు, కేరళ డ్రమ్ముల మోతల నడుమ వాసవీ మాత గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే తులాజాపూర్ అంబాభవానీ, అంబాబాయి దేవతల ఊరేగింపు చేపట్టారు. భోగేశ్వరస్వామి ఆలయంలో శమీ దర్శనం, దత్త మహాయోగ పీఠంలో పీఠాధిపతి సురుంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో శమీ దర్శన పూజలు నిర్వహించారు.

మార్మోగిన అమ్మవారి నామస్మరణ

యల్లనూరు, పెద్దవడుగూరు, గార్లదిన్నె, శింగనమల మండలాల్లోని అమ్మవారి ఆలయాలు కిటకిటలాయి. పెద్దవడుగూరులో చెన్నకేశవస్వామి, సుంకులమ్మతల్లి ప్రతిమలను ఊరేగించారు. శింగనమలలో శనివారం సాయంత్రం రామాలయం నుంచి సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా చెరువు వద్ద నున్న శమీ వృక్షం వద్దకు తీసుకెళ్లి పూజలు నిర్వహించారు.



తాడిపత్రిలో జమ్మిచెట్టును దర్శించుకుంటున్న భక్తులు



గుంతకల్లులో మారెమ్మ అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం



గుత్తిలోని కోట బెణకల బావిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



శింగనమలలో శమీ వృక్షానికి పూజలు నిర్వహిస్తున్న ప్రజలు



పెద్దవడుగూరులో చెన్నకేశవస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

వైభవంగా తెప్పోత్సవం



కొలను విహారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

గుంతకల్లు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద దసరా ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీర్చారు. అనంతరం భారీ కొలును సెట్ వేశారు. అందులో హంస వాహనంలో అమ్మవారు కొలను విహారం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వందలాది మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఇక దసరా పండగ రోజు శనివారం సాయంత్రం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కేరళ వాయిద్య బృంద కళాకారులచే పుష్పాలంకరణ, విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది.

వేంకటేశ్వరుడి రథోత్సవం



వేంకటేశ్వరస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

నార్పల: దేవీ నవరాత్రుల సందర్భంగా నార్పల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం చివరి రోజు వేంకటేశ్వరస్వామి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి కుటుంబసమేతంగా హాజరై రథోత్సవాన్ని ప్రారంభించారు. నార్పల ప్రధానవీధులలో రథోత్సవం జరగగా.. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను తిలకించిన భక్తులు పలికిన గోవింద నామస్మరణలతో పురవీధులు మార్మోగాయి. గ్రామస్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందించారు.

జ్యోతుల మహోత్సవం



జ్యోతులను ఊరేగింపుగా మోసుకెళ్తున్న తొగట వీర క్షత్రియులు

పెద్దపప్పూరు: దసరా నవరాతిర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో తొగట వీర క్షత్రియులు చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. బియ్యంపిండి, బెల్లం, నెయ్యితో ప్రత్యేకంగా తయారుచేసిన జ్యోతులను నేతన్నలు అమ్మవారి భక్తిగీతాలను ఆలపిస్తూ గ్రామంలో ఊరేగించారు. పరిసర ప్రాంతాలనుంచి వందలాది మంది తరలివచ్చి వేడుకలను వీక్షించారు. ఏటా దసరా పండుగరోజు జ్యోతుల మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బందితో కలసి ఎస్‌ఐ గౌస్‌బాషా బందోబస్తు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

రూరల్ సీఐగా ప్రవీణ్‌కుమార్



రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్

గుంతకల్లు రూరల్: గుంతకల్లు రూరల్ సీఐగా ఎస్‌జప్రవీణ్‌కుమార్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. రూరల్ సీఐగా పనిచేస్తున్న మహేశ్వర రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. ఆదివారం ఆయన రూరల్ పరిధిలోని రౌడీషీటర్లతో సమావేశం నిర్వహించారు. గొడవలు, అల్లర్ల జోలికి పోకుండా ప్రశాంత జీవనం అలవరచుకోవాలని సూచించారు. అలాకాకుండా క్రిమినల్ చర్యలకు పాల్పడినట్లు తెలిసినా, క్రిమినల్ చర్యలను ప్రోత్సహించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ ఇతరులను ప్రభావితం చేసినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా ఆరాధనోత్సవం



పామిడిలోని సీఎస్‌ఐ చర్చిలో స్త్రీల మైత్రి ఆరాధన దృశ్యం

పామిడి: మండలంలోని అన్ని చర్చిలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్‌ఐ చర్చిలో నిర్వహించిన స్త్రీల మైత్రి ఆరాధన నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాస్టరమ్మ సువర్ణమ్మ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. దేవునిపట్ల భయభక్తులున్న స్త్రీలు కొనియాడబడుదురన్నారు. ఈసందర్భంగా చిన్నారుల నృత్యప్రదర్శన, పెద్దల దైవసంకీర్తనలు రంజింపజేశాయి. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారులో జిల్లా సరిహద్దు పాదొడ్డి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్రవాహనం అదుపుతప్పి రాజేష్ అనే యువకుడికి గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన రాజేష్ గుత్తి మండలంలోని జక్కలచెరువు గ్రామంలో బంధువుల ఇంటికి బయలుదేరాడు. జిల్లా సరిహద్దు వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన రాజేష్‌ను స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మేఐహెల్ప్‌యు ఫౌండేషన్ సభ్యులు

యాడికి: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయ వెనుక కాలనీలో నివసిస్తున్న కరెంటు పుల్లయ్య భార్య ఆదిలక్షుమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ లేక పోవడంతో యాడికి మేఐహెల్ప్‌యు ఫౌండేషన్ సభ్యులను సంప్రదించారు. వారు ముందుకు వచ్చి మానవత్వంతో హిందూ సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ధృవనారాయణ, జొన్నల వెంకటేష్, నరసింహ, టి.లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి



సుబ్రహ్మణ్యశర్మ (ఫైల్)

పామిడి: పట్టణంలోని మదీనా కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కర్రా సుబ్రహ్మణ్య శర్మ(76) శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె సంతానం. మృతుడి కుటుంబసభ్యులను పామిడి పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు పరామర్శించారు.

విజేతగా తాడిపత్రి జట్టు



టాస్ వేస్తున్న కోచ్‌లు

తాడిపత్రి అర్బన్: అనంత ప్రీమియర్ లీగ్ అండర్-15 క్రికెట్ పోటీల్లో తాడిపత్రి జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఫైనల్ పోటీల్లో తాడిపత్రి జట్టు, ఆత్మకూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆత్మకూరు జట్టు 26 ఓవర్లలో 121 పరుగులు సాధించి ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేసిన తాడిపత్రి జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 122 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన తాడిపత్రి జట్టును ఏటీఎల్ లలిత, సీనియర్ కోచ్ సాధిక్ వలి, ఆర్డీటీ కోచ్ బార్గవ్ తదితరులు అభినందించారు.

14 మద్యం దుకాణాలకు 242 దరఖాస్తులు



గుంతకల్లు: గుంతకల్లు ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో 14 మద్యం దుకాణాల లైసెన్స్‌కు 242 దరఖాస్తులు అందినట్లు సీఐ శివసాగర్ తెలిపారు. ఇందులో గుంతకల్లు మున్సిపాలిటీలో 10, గుంతకల్లు రూరల్ రెండు మద్యంషాపులతోపాటు వజ్రకరూరు మండలంలో రెండు మద్యం షాపుల నిర్వహణకు ప్రభుత్వం టెండర్లు పిలిచిన విషయం తెలిసిందే. అత్యధికంగా వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల (షాపు నం.88) 30 దరఖాస్తులు, గుంతకల్లులోని 78వ దుకాణానికి 26, వజ్రకరూరు (షాపు నం.87)కు 25 దరఖాస్తులు రావడం విశేషం. ఇక గుంతకల్లు మున్సిపల్ పరిధిలోని షాపు నంబర్ 75కు 19, 76వ దుకాణానికి 13, 77వ దుకాణానికి 13, 78వ దుకాణానికి 26, 79వ దుకాణానికి 14, 80వ దుకాణానికి 18, 81వ షాపులకు 20, 82వ దుకాణానికి 19, 83వ దుకాణానికి 14, 84వ షాపులకు 9 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా గుంతకల్లు రూరల్ పరిధిలోని 85వ నంబర్ దుకాణానికి 11, 86వ దుకాణానికి 11 దరఖాస్తులు వచ్చాయన్నారు. దీంతో ప్రభుత్వానికి దాదాపు రూ.4.80 కోట్ల ఆదాయం లభించింది. సోమవారం అనంతపురంలోని జేఎన్‌టీయూ కళాశాలలో ఉదయం 10.00 గంటలకు లాటరీ పద్ధతి ద్వారా మద్యం షాపుల లైసెన్‌లను కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా ఏకాదశి పూజలు





అలంకరణలో అనంతగజగరుడ లక్ష్మీనారాయణస్వామి, విఠోబ ఆలయంలో పాండురంగడు

పామిడి: పట్టణంలోని తగ్గుదేవాలయం, రంగసుభే ఫిర్కా విఠోబ ఆలయాల్లో ఆదివారం వేర్వేరుగా ఏకాదశి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ఆలయాల్లోని శ్రీదేవి, భూదేవి సమేత అనంత గజగరుడ లక్ష్మీ నారాయణస్వామి దేవతామూర్తులను, పాండురంగడు విగ్రహాన్ని శోభాయానంగా అలంకించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల్లో దేవతామూర్తులను పల్లకీలో ఉంచి ప్రాకారోత్సవం చేశారు. భజన మండలి సంకీర్తనాలాపనల నడుమ నిర్వహించిన ఈప్రాకారోత్సవంలో భాగంగా ఆలయాలు గోవింద, పాండురంగస్వామి నామస్మరణాలతో మార్మోగాయి.



భజన మండలి ఆధ్వర్యంలో విఠోబస్వామి ప్రాకారోత్సవ దృశ్యం

తేనెటీగల దాడి

- ఏడుగురికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని మిడ్ పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్) వద్ద శనివారం పర్యాటకులపై తేనెటీగలు దాడి చేశాయి. దసరా పండుగ సందర్భంగా పెనకచెర్లకు చెందిన కొందరు సమీపంలోని ఎంపీఆర్ వద్దకు చేరుకున్నారు. రిజర్వాయర్ పరిసరాల్లో తిరుగుతున్న వారిపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఘటనలో తీవ్ర అస్వస్థతకు లోనైన లక్ష్మి, ఆదిలక్ష్మి, తేజ, విష్ణువర్ధన్, వేణుమూర్తి, రమశ్రీ, మణికంఠను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు.

రస్తా వివాదం.. పలువురికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లిలో రస్తా వివాదంగా శనివారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ఎగువపల్లికి చెందిన దేవేంద్ర గ్రామ సమీపంలోని 44 జాతీయ రహదారిపై మొబైల్ టిఫెన్ సెంటర్ నిర్వహిస్తూ సాయంత్రం వాహనాన్ని ఇంటి వద్ద రోడ్డు పక్కనే నిలిపేవాడు. అయితే వాహనం రోడ్డుకు అడ్డుగా ఉండడంతో పక్కకు పెట్టుకోవాలని దేవేంద్రకు అదే గ్రామానికి చెందిన రామ్మోహన్ సూచించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు జోక్యం చేసుకోవడంతో వివాదం మరింత జఠిలమై పరస్పరం కట్టెలతో దాడి చేసుకున్నారు. దీంతో రామ్మోహన్, ఆదినారాయణ, నాగలక్ష్మికి గాయాలయ్యాయి. బాధితుడు రామ్మోహన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

నేటి నుంచి 'పల్లె పండుగ' గ్రామసభలు

గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా సోమవారం నుంచి ఈ నెల 20 వరకూ పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యంగన్నపల్లి, ధర్మాపురం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం ప్రారంభించి నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తామన్నారు. ఈ నెల 20న బసినేపల్లి తండాతో పంచాయతీ వారోత్సవాలు ముగుస్తాయని ఎంపీడీఓ తెలిపారు.

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నెతోపాటు ఇల్లూరు గ్రామ పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి 20వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు.

పుట్లూరు: ఉపాధి పనుల ప్రారంభం సందర్భంగా సోమవారం నాలుగు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కందికాపుల, ఏ.కొండాపురం, కడవకల్లు, సూరేపల్లి గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమం విజయవంతం చేయాలని ఆమె సూచించారు.

పామిడి: మండలంలో సోమవారం నుంచి ఈ నెల 20వ వరకూ నిర్వహించే పల్లెపండుగ వారోత్సవాలను జయప్రదం చేయాలని ఎంపీడీఓ కే తేజోష్ణ ఆదివారం తెలిపారు. 14న అనుంపల్లి, దిబ్బసానిపల్లి, నీలూరు, పాళ్యం, రామగిరి, రామరాజుపల్లి, 15న ఎద్దులపల్లి, 16న దేవరపల్లి, 17న ఖాదర్‌పేట, 18న కండ్లపల్లి, సొరకాయలపేట, 19న ఎదురూరు, జీ కొట్టాల, పాళ్యంతండా, రామగిరి ఎగువతండా, వంకరాజుకాలువ, 20న గజరాంపల్లి, కత్రిమల, కట్టకిందపల్లి గ్రామాల్లో కార్యక్రమాలు ఉంటాయన్నారు. పల్లె పండుగ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు హాజరు కావాలని ఆమె కోరారు.

అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గార్లదిన్నె: మండలంలోని ప్రజలు, అధికారులు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఈరమ్మ సూచించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపిన వివరాలు మేరకు ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో సోమవారం నుంచి నాలుగు రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణోత్సవం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితుడు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం మంత్రోచ్చరణాల మధ్య శ్రీవారి కల్యాణం కనుల పండువగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీవారి కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు ఆలయ కమిటీ తరపున అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రంగయ్య, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కార్యదర్శి నారాయణస్వామి, సభ్యులు సుదర్శన్, జయంతి వెంకట్, వెంకటేశ్వర్లు, రవి, ప్రవీణ్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.